ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

రైతుల ఆశలకు ఊపిరి

- వర్షాలతో నిండుతున్న కుంటలు
- నార్లు పోసేందుకు సిద్ధమవుతున్న రైతులు

సాగుకు సిద్ధమవుతున్న పొలం

ముఖం చాటేసిన వరుణుడు కరుణించాడు. అప్పుడప్పుడు గట్టి వానలు పడటంతో రైతుల ఆశలకు ఊపిరి పోసినట్లైంది. మొన్నటి వరకు ఎండలు తీవ్రంగా కాయడంతో నీరు లేక రైతులు వరి నార్లు పోయడానికి ఆలోచించారు. వర్షాలు పడితేనే సాగు జరుగుతుందని చెప్పారు. ఆదివారం కృష్ణా తూర్పు డ్టాకు నీటిని విడుదల చేశారు. మరో వైపు ప్రకృతి కరుణించి అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో కుంటల్లోకి నీరు చేరుతుంది. నార్లు పోయడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. రైతులు విత్తనాలు చల్లడానికి సిద్ధమవుతున్నారు. పొలాలను సిద్ధం చేస్తున్నారు. గన్నవరం మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. అన్నీ అనుకూలిస్తే పంట చేతికి వస్తుంది. రెండేళ్లుగా వరి పైరు రైతుల ఇళ్లకు చేరుతుంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంతో ఆర్థిక ఇబ్బందుల నుండి కొంత వరకు బయటపడ్డారు. అయితే చివర్లో కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు నానా అగచాట్లు పడ్డారు. ఈసారి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయనే ఆశతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వాన రైతుల్లో కొంత మేర ఉత్సాహాన్ని నింపింది. గన్నవరంలో 102 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన గ్రామాల్లో 50 మీల్లి మీటర్ల నుండి 60 మిల్లీ మీటర్ల వరకు నమోదైంది. అత్యల్పంగా 15 మిల్లీ మీటర్లు తెంపల్లిలో నమోదైంది. వానలు కురవడం వల్ల నారు పోయడానికి వీలుందని తెలిపారు. ఇప్పటికే పోసిన నార్లు జీవం పోసుకుంటాయని రైతులు చెబుతున్నారు. మరో వైపు పొలాలను దున్ని సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆగస్టు మొదటి వారంలో నాట్లు

ఏలూరు కాలువ కింద నీరు వస్తే ఆగస్టు మొదటి వారం నుండి నాట్లు పడతాయని రైతులు చెబుతున్నారు. కాల్వ నీరు పంట పొలాలకు ఎక్కడం లేదని, ఇంజన్లతో పంట కాల్వలకు నీరు మళ్లించాల్సి (మిగతా 2లో)

(మిగతా 2లో)

నేడు కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుంది. కోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్ ఫలితాన్ని అధికారులు వెల్లడించనున్నారు. సీల్డ్ కవర్ తీర్పు నేపథ్యంలో అధికార పార్టీ వ్యూహాత్మక అడుగులు వేయనుంది. టాస్ అనివార్యమైతే విజయం ఎవరిని వరిస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది. సీల్డ్ కవర్ తీర్పు సమానం అయితే అధికారులు మళ్లీ ఎన్నిక పెట్టే ఆలోచనలో ఉన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక అనివార్యం అయితే మెజారిటీ సభ్యులతో టీడీపీ ఖాతాలోకి చేరే అవకాశం ఉంది. టాస్ నిర్ణయంతో పీఠం ఒకరికి దక్కితే మరొకరి స్పందన ఎలా ఉండబోతుంది... ఎమ్మెల్యే హాజరవుతారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక జరిగితే టీడీపీలోకి వచ్చిన వైసీపీ కౌన్సిలర్‌లతో సంబంధం లేకుండానే 15 మంది సభ్యులతో టీడీపీ పాలకవర్గం ఏర్పాటుకు అవకాశం ఉంది. వైసీపీ బలం 14గా ఉన్నప్పటికీ అందులో ఒక కౌన్సిలర్ ఇటీవల మరణించడంతో వైసీపీ నుండి ఓటు వేసే వారి సంఖ్య 13గా ఉంది. అందులో కొందరు ఇప్పటికే టీడీపీకి జైకొట్టారు. బలాల పరంగా టీడీపీ పాలకవర్గం ఏర్పాటుకు ఎలాంటి అవరోధం లేదు. చైర్మన్ అభ్యర్థిగా చెన్నుబోయిన చిట్టిబాబు పేరు ఖరారైంది. అయితే ఆయన అభ్యర్థిత్వాన్ని కొందరు టీడీపీ కౌన్సిలర్లు పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. తాము అవసరమైతే రాజీనామా చేస్తామని చెబుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ వివాదం ఎన్నికకు విఘాతం కలిగించే అవకాశం ఉంది. ఇదే కనుక జరిగితే టీడీపీకి అదనపు బలంగా మారిన వైసీపీ నుండి టీడీపీలోకి వచ్చిన కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే వసంత మాట వేద వాక్కు గా నడుచుకునే అవకాశం ఉంది. టీడీపీ నుండి వైసీపీలోకి వచ్చిన వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని అధికార టీడీపీ దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నేపథ్యంలో గతంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం పరిధిలో అదనపు బలగాలను మోహరించారు.

మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

కృష్ణాజిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి

- ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి
- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం కృష్ణాజిల్లాకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఏడాది పాలన పూర్తయిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మధుసూదన్‌రావు శ్రామిక భవన్ టౌన్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణాజిల్లా కేంద్రంగా ఉన్న మచిలీపట్నంను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 30 నెలల్లో పోర్ట్ నిర్మాణం పూర్తి చేసి ఐదు వేల ఎకరాల్లో భూములు సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారని, ఆచరణలో చూస్తే పోర్టు నిర్మాణం నిదానంగా జరగడమే గాక పోర్టు ఆధారిత పరిశ్రమలు జాడ కూడా లేదన్నారు. బందరు రూరల్ ప్రాంతాల్లో రెండు వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న భారత్ సాల్ట్ పరిశ్రమ మూతపడిందన్నారు. కొత్త పరిశ్రమల సంగతి పక్కన పెడితే ఉన్న పరిశ్రమలు మూత పడకుండా చూడాలన్నారు. జూయలరీ పార్క్‌ను విస్తరించి శిక్షణా సంస్థ ఏర్పాటు చేసి నైపుణ్యాలను మెరుగుపరుస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. పెడన కలంకారి పరిశ్రమను ఆదుకునేందుకు తీసుకువస్తానన్న చేనేత క్లస్టర్ జాడలేదన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను నేటి వరకు కల్పించలేదన్నారు. కీలకమైన సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ ఇంకా ప్రారంభించలేదని తెలిపారు. గుడివాడలో ప్రైవేట్ రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానన్న హామీ అలాగే ఉందన్నారు. కృష్ణాడెల్టాకు సంబంధించి పంట కాల్వలు, మేజర్ డ్రెయిన్ల అభివృద్ధి పనులు వేసవిలోనే మొదలుపెట్టి పూర్తి చేస్తామని ఆర్భాటం చేసి చివరకు వర్షాలు ప్రారంభమయ్యాక మొదలుపెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన చోడవరం, బండికోళ్లంక వద్ద డ్యాములు కడతామన్న హామీ నెరవేదన్నారు. సముద్రతీర గ్రామాల్లో ఉప్పునీరు ఎగదన్ని వేలాదిఎకరాల పంట (మిగతా 2లో)

రైతులకు సకాలంలో సాగునీరు

- ఎంఎల్ఎలు బోండా, యార్లగడ్డ, మండలి
- కృష్ణా తూర్పు డెల్టా కాల్వలకు నీరు విడుదల

నీటిని విడుదల చేస్తున్న ఎంఎల్ఎలు, కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్‌లు, ఎంఎల్ఎలు బోండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కృష్ణా తూర్పు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఆదివారం కృష్ణా తూర్పు డెల్టా కాల్వలకు వారు నీటిని విడుదల చేశారు. పూజా కార్యక్రమం అనంతరం రైవస్ కాలువకు 700, బందరు కాలువకు 300 మొత్తం వెయ్యి క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ నుండి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నీటి విడుదల వల్ల 7 లక్షల 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. తమ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కృష్ణా డెల్టాను కాపాడుకుంటూ సరైన సమయంలో, సకాలంలో నీటిని విడుదల చేస్తోందన్నారు. పోరాటాలు చేస్తేనే నీటిని విడుదల చేసే పరిస్థితి నుండి షెడ్యూల్ ప్రకారం విడుదల చేసే పరిస్థితికి వచ్చామన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతో పాటు ఎరువులు, విత్తనాలు (మిగతా 2లో)

రూ.200 కోట్లతో సివిల్ పనులు

విఎంసి చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాధరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ

గతేడాది జూన్ ఒకటి నుంచి చేపట్టిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నామని, రూ.200 కోట్ల అంచనా విలువతో విజయవాడ నగరంలో వివిధ రకాల సివిల్ పనులు జరుగుతున్నాయని విఎంసి చీఫ్ ఇంజినీర్ (సిఇ) ఆర్ శ్రీనాధరెడ్డి చెప్పారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చీఫ్ ఇంజినీర్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : నగరంలో సాధారణ నిధులతో చేపట్టిన పనులు ఏమిటి ?

జవాబు : గత ఏడాది జూన్ 1 నుంచి చేపట్టిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నాం. రూ.200 కోట్ల (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

కృష్ణాజిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి

భూములు పాడైపోతున్నాయని, దీనికి కారణంగా ఉన్న అవుట్ ఫాల్స్ స్లూయిస్ గేట్లు బాగు చేయాల్సి ఉందన్నారు. ఆక్వా జోన్లో రొయ్యల పెంపకం రైతులు నాలుగు వేల మంది విద్యుత్ రాయితీ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. బుడమేరు, కృష్ణానది వరదల సందర్భంగా నాయకులు చెప్పిన మాటలు నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. బుడమేరు ఆక్రమణలు తొలగించి నీటిపారుదల సామర్థ్యాన్ని పెంచడం, సముద్రం వరకు కృష్ణా కరకట్టలను బలపరుస్తామన్న హామీలు మిగిలే ఉన్నాయన్నారు. మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గం నిర్మాణం కాగితాలకే పరిమితమైందన్నారు. ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక మందిరాన్ని నిర్మించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణా కేంద్రం, నాగాయలంక మండలం ఎదురుమొండి దీవులకు వంతెన నిర్మాణం, గుడివాడ పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణం తదితర ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు, సిపిఎం మచిలీపట్నం కార్యదర్శి బూర సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు

సకాలంలో అందించి పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటున్నామన్నారు. పక్కా ప్రణాళికతో బాధ్యతాయుతంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ధాన్యం సేకరణ జరిపి సకాలంలో రైతు ఖాతాలకు జమ చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. ఈ నెల పదో తేదీనే నీటిని విడుదల చేయాలని నీటిపారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ పంట సాగుకు రైతులు సిద్ధంగా లేకపోవడంతో 15న విడుదల చేస్తున్నామన్నారు. కృష్ణా డెల్టాలో చివరి నియోజకవర్గం అవనిగడ్డ అని, గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల కాలంలో జల వనరుల శాఖకు నిధులను విడుదల చేయక కాలువలలో తూటు కాడ, గుర్రపు డెక్కతో నిండి కొద్దిపాటి వర్షానికి పంట పొలాలు మునిగి రైతులు త్రీవంగా నష్టపోయేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందించిన ఘనత తమదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, జిల్లా సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేశ్, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కె.నరసింహమూర్తి, చీఫ్ ఇంజనీర్ పి.రాంబాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రావెళ్ల రవికిరణ్, బి.ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశలకు ఊపిరి

వస్తుందని తెలిపారు. అందుకు ఎకరాకు రూ.వెయ్యి ఖర్చు అవుతుందని చెప్పారు. ఆదిలో ఖర్చులు పెరిగినా నాట్లు పూర్తయితే ఆ తర్వాత ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. మెట్ట గ్రామాల్లో చెరువులకు నీరు చేరితేనే నాట్లు పడతాయి. చెరువులకు నీరు చేరే వర్షం ఇంకా పడలేదు. పోలవరం నీరు చెరువులకు మళ్లించడానికి కొన్ని ఊళ్లలో ఇంజన్లు పెట్టారు. మరి కొన్ని గ్రామాల్లో ఇంజన్లు పెట్టలేదు.ఈ పరిస్థితుల్లో వెదజల్లే పద్ధతి మేలని చెబుతున్నారు. వర్షాధారంతో పంటలు పండించుకునే రైతులకు ఈ వర్షాలు ఉప యుక్తంగా ఉంటాయని చెబుతున్నారు. పత్తి, కూరగాయలు సాగుకు మేలని తెలిపారు. పత్తి వేయడానికి గొల్లనపల్లి, బిబిగూడెం, గోపవరపుగూడెం ఏరియాల్లో రైతులు సన్నాహాలు చేస్తున్నారు. పురుషోత్తపట్నం, విఎన్ పురం, బిలిగూడెం, సూరంపల్లి ఏరియాల్లో కూరగాయలు వేయడానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు. వచ్చే నెలలో కూరగాయలు మార్కెట్‌లోకి వస్తాయని, ధరలు తగ్గుతాయని ఆశిస్తున్నారు.

సిద్ధమవుతున్న వరి నారుమడులు

వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై దృష్టి

• టైమ్ బ్యాంక్ విధానం అమలుకు చర్యలు • ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

తరాలకు వారధులుగా.. భవిష్యత్తుకు నిర్మాతలుగా ఉన్న వయోవృద్ధులకు ఆత్మీయతను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా ప్రతిఒక్కరూ సహానుభూతితో వ్యవహరించాలని, నైతిక విలువల పరంపర కొనసాగేలా చూడాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ వద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు డివిజనల్, జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతోందని.. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వృద్ధులు ఆరోగ్యంగా, సుసంపన్నంగా, ఆనందంగా ఉన్నప్పుడే స్వర్ణాంధ్ర సాకారమవుతుందన్నారు. స్విట్జర్లాండ్ తరహాలో వృద్ధులకు సేవ చేసి క్రెడిట్స్ పోగేసుకొని అవసరమైనప్పుడు తిరిగి ఉపయోగించుకునే టైమ్ బ్యాంక్ విధానాన్ని జిల్లాలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సీనియర్ సిటిజన్స్ అనుభవజ్ఞులైన యువతీయువకులని.. న్యూక్లియర్ కుటుంబాల నేపథ్యంలో చిన్నారులు, విద్యార్థులకు సీనియర్ సిటిజన్స్‌తో ఇంటరాక్షన్ సెషన్స్ నిర్వహించే

విషయమై ఆలోచిస్తున్నామని, వయోవృద్ధులు చెప్పే చిన్న పాఠమే జీవితానికి ఓ గొప్ప పాఠమన్నారు. వద్ధాశ్రమాలకు అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు చొరవ చూపనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులు పొందేందుకు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ తరహాలో వద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నెలలో ఒకరోజు ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు డా. బి.కీర్తి, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఎన్‌టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు పాల్గొన్నారు.

'జీవన సౌరభాలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పద్యానికి వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉందని, తెలుగువారు ప్రాణప్రదంగా ప్రేమించే సాహిత్యం పద్యము అని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీ మీటింగ్ హాల్లో కృష్ణాజిల్లా రచయితల సంఘం సౌజన్యంతో జరిగిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి పద్య కవిత సంపుటి జీవన సౌరభాలు పుస్తకాన్ని బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవిత్వం రాస్తూనే ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంతో పాటు పద్య కవిత్వాన్ని కూడా వారికి నేర్పుతూ తెలుగు భాషాభివృద్ధికి ఇతోదిక సేవ చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ జీవీ పూర్ణచంద్ గౌరవ అతిథిగా పాల్గొని రచయిత్రి రాసిన రచనలోని గొప్పతనాన్ని విశదీకరించారు. డాక్టర్ గుమ్మ సాంబశివరావు పుస్తక సమీక్ష చేస్తూ మంచి కవిత్వం చిరస్థాయిగా ఉంటుందని, పద్య కవిత్వం కనుమరుగవుతున్న దశలో రచయిత్రి ఉమా సరస్వతి మంచి పద్య కవిత్వం రాసి భవిష్యత్ తరాలకి మార్గదర్శయ్యారని అభినందించారు. శర్మ సిహెచ్ స్వాగత వచనాలతో ప్రారంభమైన ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు, రచయిత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: సరళ యోగాసనాల అభ్యసన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని, ప్రతి ఆసనంతోనూ ప్రత్యేక ప్రయోజనాలున్నాయని, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా విజయవాడ బీఆర్‌టీఎస్‌యోగా స్ట్రీట్‌లో ఆదివారం జరిగిన యోగా అభ్యసన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని.. ఐసీడీఎస్, మత్స్య శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ

సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ 45 నిముషాల సరళ యోగాసనాలతో బీపీ, మధుమేహం, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యం వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చన్నారు. రోజులో కొంత సమయాన్ని తప్పనిసరిగా యోగాకు కేటాయించాలని, యోగాంధ్ర అభ్యసన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో జూన్ 21 నాటికి కనీసం పది లక్షల మందికి యోగాసనాలు నేర్పించే ఉద్దేశంతో అయిదు వేల మంది శిక్షకులతో ప్రతిరోజూ గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో యోగాచరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అంగన్వాడీ కేంద్రాల్లోనూ యోగా ప్రోటోకాల్ సరళ యోగాసనాల అభ్యసన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. మహిళలకు, చిన్నారులకు యోగా ఔన్నత్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, మత్స్యశాఖ డీడీ చక్రాణి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డా.ఎన్‌టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డా. జె.సుమన్, ఆయుష్ అధికారులు డా.వి.రాణి, డా.రామత్లేహి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో సివిల్ పనులు

అంచనా విలువతో వివిధ రకాల పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యుజిడి), వివిధ రకాల సివిల్ పనులు జరుగుతున్నాయి. వీటిలో భాగంగానే రూ.1635 పాట్‌హోల్స్ (ప్యాచ్ వర్క్‌లు) రూ.2.02 కోట్ల అంచనా వ్యయంతో చేయించాం. మరికొన్ని పాట్ హోల్స్ చేయించడానికి సర్వే జరుగుతోంది.

ప్రశ్న : దెబ్బతిన్న ఎస్‌టిపి (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను ఎక్కడెక్కడ అభివృద్ధి చేస్తున్నారు.? అలాగే కొత్తవి ఎన్ని నిర్మిస్తున్నారు ?

జవాబు : ఎప్పుడో ఏర్పాటు చేసి, దెబ్బతిన్న ఎస్‌టిపిలను పున:నిర్మాణ పనుల ద్వారా ఆధునీకరించి ఉపయోగంలోకి తీసుకురావాల్సి ఉంది. ప్రధానంగా రామలింగేశ్వర్‌నగర్, ఆటోనగర్, సింగ్‌నగర్, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో రెండేసి ఎస్‌టిపిల ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. అలాగే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఆటోనగర్, రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో మరో రెండు కొత్త ఎస్‌టిపిలను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణాలకు రూ.120 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశాం. అమృత్ పథకం కింద 25 శాతం నిధులు, 15వ ఆర్థిక సంఘం నుంచి 75 శాతం నిధులు కేటాయించి పనులు చేయిస్తాం. శ్రీ కృష్ణా ఎన్విరో ఇంజినీర్స్ అనే ప్రముఖ కాంట్రాక్ట్ కంపెనీ ద్వారా పనులు చేపట్టాం.

ప్రశ్న : మురుగునీరు (వేస్ట్ వాటర్) కృష్ణానదిలో, కాల్వల్లో కలవకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ఇది చాలా ముఖ్యమైన అంశం. సాధ్యమైన మేరకు ఇళ్లల్లో నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌తో పాటు ఇతర మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు నగరంలో గుండా ప్రవహించే మూడు కాల్వల్లో, అలాగే పక్కనే ఉన్న కృష్ణానదిలో కలుస్తున్నాయి. అందువల్ల కాల్వలు, కృష్ణానది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానంగా విఎంసిపై ఉంది. ఈ సమస్య గతం నుంచి కూడా ఉంది. విఎంసి, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయంతో ఈ జఠిల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అయితే మురుగునీరు (వేస్ట్ వాటర్), ఇతర మురుగునీరు నదిలో, కాల్వల్లో కలవకుండా ఆయా ప్రాంతాల్లో ఎస్‌టిపిలు, డిబి స్టేషన్లు నిర్మించి, తద్వారా వేస్ట్ (మురుగు) నీటిని శుద్ధి చేయాల్సి ఉంది. శుద్ధిచేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. అయితే నగర పరిధిలో ఎస్‌టిపిల నిర్మాణాలకు స్థలా భావం నెలకొని ఉంది. దీంతో వీటిని నిర్మించడం కొంత కష్టంగా ఉంది. అవసరం, ప్రాధాన్యతల రీత్యా ఎస్‌టిపిల నిర్మాణాలకు రూ.30 కోట్ల మేర కేటాయింపు జరిగింది. త్వరలో వీటికి సంబంధించి టెండర్లు పిలుస్తాము.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : తాలుకా పోలీసు స్టేషన్ ఎస్.ఐ చంటిబాబు ఆధ్వర్యంలో ఆదివారం దొండపాడు రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని పరిశీలించిన అనంతరం ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. వాహనానికి సంబంధించిన కాగితాలు వాహనంలోనే ఉండాలన్నారు. ప్రభుత్వం నిబంధలనకు విరుద్ధంగా ఉండే వాహనాలను సీజ్ చేసి కోర్టు పరిధిలోకి అప్పగించడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ తనిఖీలలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యగూరపాడు సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : కొయ్య గూరపాడు సర్పంచ్ కొరివి మాధవి భర్త కొరివి కృష్ణ ప్రసాద్ (చిన్ని) అనా రోగ్యంతో శనివారం సాయంత్రం విజయవాడలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. వీరికి ఒక కుమారుడు. ఆయన అమెరికా నుండి 17వ తేదీ మంగళవారం ఉదయం వస్తారని అదే రోజు కొయ్యగూరపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. కష్ణ ప్రసాద్ (చిన్ని) భౌతికకాయానికి మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన్ రావు, పలువురు ప్రముఖులు, గ్రామస్తులు నివాళులర్పించారు.

కళాపీఠం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే

ప్రజాశక్తి - పామర్రు : ఘంటసాల కళా పీఠం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే పామర్రు లో ఘనంగా జరిగింది. స్థానిక కొండిపర్రు రోడ్డులోని చైతన్య ఆగ్రో మిల్లు లో జరిగిన ఈ కార్యక్రమంలో కూనపరెడ్డి వెంకట ధర్మారావు, పాటిబండ రాంబాబులను పలువురు శాలువాలు కప్పి సత్కారించారు. ఈ సందర్భంగా కళాపేతం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకష్ణ మాట్లాడుతూ పిల్లలను నైతిక బాధ్యతతో పెంచి సమాజానికి మంచి పౌరులుగా అందించడంలో తండ్రి పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. దగ్గుమిల్లి గ్రామ సర్పంచ్ కూనపరెడ్డి చంద్రశేఖర్, ప్రముఖ ధాన్యం వ్యాపారితోట రమేష్, కనుమురు మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పామర్రు : విద్యార్థినికి చదువుకు మనం వనం ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. భీమవరంలోని విష్ణు కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న తెనాలికు చెందిన తురిమెళ్ళ మైనర్ బాబు కుమార్తె తురిమెళ్ళ యోగితకు పామర్రు మండలం కొండా యపాలెంకు చెందిన మనం వనం ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు (పిఎస్ఆర్) రూ.1,50, 000 ఫీజు నిమిత్తం మొదటి భాగంగా 80,000 రూపా యలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్ర మంలో నత్త రవి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఎన్ని ఇబ్బందులున్నా, ఎన్ని కష్టాలున్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, అందుకు నిదర్శనమే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకీ రూ.15 వేల చొప్పున నిధులు జమచేయడమేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్కూల్లు తెరిచే నాటికి ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు ఇస్తామన్న హామీ మేరకు పథకం అమలు చేశామన్నారు. స్కూళ్లను మోడల్ స్కూళ్లుగా మార్చి విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు .విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉండేలా నియామకాలకు శ్రీకారం చుట్టాం అని తాజాగా పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ స్కూల్లు సాధించిన ఫలితాలు ప్రభుత్వ పాలనకు నిదర్శనం అన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఫలితాలొచ్చాయన్నారు. జనసేన నాయకులు బండి రామకృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మంత్రి మనోహర్‌ను కలిసిన బండి రామకృష్ణ

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను డీసీఎంఎస్ చైర్మన్, మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకష్ణ ఆదివారం తెనాలి వెళ్లి ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 18వ తేదీన జరగబోవు డీసీఎంఎస్ చైర్మన్ పదవి బాధ్యత స్వీకరణ మహెూత్సవానికి హాజరు కావలసిందిగా కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం నాదెండ్ల మనోహర్ బండి రామకష్ణను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సంరద్భంగా రామకష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం తన వంతు కషి చేస్తానని అన్నారు.

యార్లగడ్డ వెంకట్రావుతో భేటీ : గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డవెంకట్రావు ను ఆదివారం మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ , డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకష్ణ మర్యాద పూర్వకంగా కలిసి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వానం అందించారు. వారితోపాటు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు,మైకెల్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బండి రామకృష్ణ

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాదకద్రవ్యాలు వినియోగించడం ద్వారా సమాజానికి హాని జరగడంతో పాటు వ్యక్తుల మానసిక స్వభావాన్ని పతనం చేస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు రిటైర్డ్ డి.ఎస్.పి బాబ్జి అన్నారు. ఆదివారం అవనిగడ్డ ఏఎస్ఆర్ కళ్యాణ మండపంలో అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీస్ సిబ్బందికి మాదకద్రవ్యాల నిర్మూలన వినియోగం వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న బాబ్జి మాట్లాడుతూ నేడు సమాజంలో యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. వీరిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వారి అలవాట్లను పరిశీలించకపోవడం వల్ల ఎక్కువగా నష్టం జరుగుతుందన్నారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను ప్రతి తల్లిదండ్రి దష్టి సారించి గమనించాలని కోరారు. దీనితో కుటుంబాలను మత్తుపదార్థాలు విచ్చిన్నం చేయకుండా చూడవచ్చునన్నారు. ప్రస్తుత కాలంలో చిన్న వయసు వారు కూడా మాదకద్రవ్యాలు వినియో గిస్తున్నందున వీటిని అరికట్టడం కోసం పోలీస్ శాఖ మరింత బాధ్యతగా అప్రమత్తతో ఉండి నిర్మూలనకు కషి చేయాలని బాబ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఘంటసాల : మొవ్వ ఐసిడిఎస్ పరిధిలోని ఘంటసాల మండలం శ్రీకాకుళం సెక్టార్ సూపర్ వైజర్‌గా పని చేసిన డి.మేరీ ఇటీవల బదిలీల్లో భాగంగా గుడివాడకు వెళ్లారు. ఈ సందర్భంగా కొడాలిలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు అభినందన సభ ఏర్పాటు చేసి డి.మేరీ దంపతులను ఘనంగా సత్కరించారు. అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అందించే సేవలపై ప్రత్యేక దష్టిసారించేవారని మేరీని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మళ్లీ గ్రేడ్-1 సూపర్వైజర్ గా పదోన్నతి పొంది మొవ్వ ప్రాజెక్టుకు రావాలని ఆకాంక్షించారు.

బందరులో మహిళల నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జిల్లా తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆది వారం బందరు పురవీధుల్లో అమరావతిపై విష ప్రచారాన్ని నిరసిస్తూ భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దేవతల రాజధాని అమరావతిపై సాక్షి మీడియాలో అసత్య ప్రచారం, అనుచిత వ్యాఖ్యలను జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలసుల స్వర్ణలత ఖండించారు. నిరసన ప్రదర్శనలో వందలాదిగా పాల్గొన్న మహిళలు బస్టాండ్ సెంటర్ నుండి లక్ష్మీటాకీస్ సెంటర్ వరకు ర్యాలీగా నిరసన ప్రదర్శన లో పాల్గొన్న అనంతరం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన మహిళలు జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ప్రభుత్వం తెచ్చిన స్మార్ట్ మీటర్లు విధానాన్ని వ్యతిరేకిస్తూ వాటి మీద ప్రజలకు అవగాహన, చైతన్యం కలిగిస్తూ సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. రాజుపేట గాంధీ బొమ్మ సెంటర్, మచిలీ పట్నం మున్సిపల్ పార్కులో సిపిఎం నగర కమిటీ సభ్యులు కొడాలి శర్మ, సిహెచ్ రాజేష్, బి సుబ్ర హ్మణ్యం, సిహెచ్ జయరావు, పి నాగయ్య తదితరులు కరపత్రాలు పంచిన వారిలో ఉన్నారు.

కృష్ణా నదిలో గాలిస్తున్న దృశ్యం

కృష్ణానదిలో యువకుడు గల్లంతు

ఫణికుమార్ (ఫైల్)

ప్రజాశక్తి-ఘంటసాల : కృష్ణానదిలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం శ్రీకాకుళం గ్రామానికి చెందిన ఆత్కూరి ధర్మారాజు కుమారుడు ఫణికుమార్ (25) శ్రీకాకుళం సమీపం లోని కష్ణానదికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కష్ణానదిలో ఫణి కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రొద్దుపోయే వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. స్థానికులు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. ఫణి కుమార్ గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రిషన్ గా పని చేస్తున్నాడు.

కాలువ దాటుతూ కాలుజారి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పెడన మండలం ఈదుముడి గ్రామంలో లజ్జబండ కాలవ దాటుతుండగా బాలచంద్రరావు (57) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతయ్యాడు. స్థానికుల అందించిన సమాచారం మేరకు రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ గంట్ల సత్యనారాయణ గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 16 వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అర్జీలు అధికారులు స్వీకరిస్తారన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీస్థితిని తెలుసుకోవచ్చున్నారు.

29న ఉద్యోగ మేళా

అయ్యప్ప స్వామి

ప్రజాశక్తి- కోడూరు : లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థను స్థాపించి 23 సంవత్సరములు పూర్తయిన తరుణంలో టాటా స్ట్రైవ్ 9 వ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ దివిసీమ వ్యవస్థాపకులు పూతబోయిన అయ్యప్ప స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ ఆదివారం కోడూరు లోని శ్రీ దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్ధనా మందిరంలో టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉదయం 9 గంటల నుండి జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు ఉచిత స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు తమ లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8 జాబ్ డ్రైవ్లలో సుమారు 300 మంది వరకు శిక్షణ తీసుకొని ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో ఉన్న ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. కావున అవనిగడ్డ నియోజకవర్గం నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని మరిన్ని వివరాల కోసం మాచర్ల నారాయణ,బడే నాని, బండే జయ కిషోర్ లను సంప్రదించాలన్నారు.

పాతపాడులోని దుర్గమ్మ భూముల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ కనకదుర్గా దేవి దేవస్థానానికి చెందిన భూముల్లో ఆలయ అవసరాల దృష్ట్యా 2016-18లో ప్రారంభించిన సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి పెరగాలని దేవస్థానం ఇఒ వి.కె.శీనానాయక్ అన్నారు. ఆదివారం ఉదయం నున్న సమీపంలోని పాతపాడులో ఉన్న దేవస్థానం సోలార్ ప్లాంట్ పరిశీలించారు. భూముల పరిరక్షణలో భాగంగా 5 ఎకరాల 85 సెంట్లు ఉన్న దుర్గమ్మ వారి స్థలంలో నెడ్ క్యాప్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించగా 1 మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్ పనులు 2022కి పూర్తి అయి, ఉత్పత్తి మొదలైందని ఇఒకు సిబ్బంది వివరించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ద్వారా నెలకు 1.20 లక్ష యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, దుర్గగుడికి నెలకు లక్ష యూనిట్ల సౌరశక్తి వినియోగం జరుగుతుందని సిబ్బంది వివరించారు. మిగులు 20వేల యూనిట్లకు సంబంధించి నెట్ మీటరింగ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా శీనానాయక్ అధికారులను ఆదేశించారు. సోలార్ ప్లాంట్ మెరుగైన నిర్వహణకు నోడల్ ఏజెన్సీ లేఖ రాయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్ పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీసులను న్మానిస్తున్న దృశ్యం

పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల పోలీస్ శాఖలో బదిలీల పర్వంలో భాగంగా, గంపలగూడెం పోలీస్ స్టేషన్ నుండి ఐదు మంది వివిధ ప్రదేశాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అందులో హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్, సుధీర్, కానిస్టేబుల్స్ సురేష్, నాగేశ్వరరావు, గోపీలను ఎస్ఐ శ్రీనివాస్ శనివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాలపాటు గంపలగూడెం మండలంలో ఐదేళ్లపాటు సేవలందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బదిలీపై వెళ్లిన ఆయా ప్రదేశాల్లో సైతం అదే విధంగా ప్రజలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ ఆళ్లగడ్డ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలం వేమవరం గ్రామ వాస్తవ్యులు శ్రీ జొన్నల గడ్డ హరికృష్ణ, లతా దంప తులు కుటుం బ సమేతంగా అమ్మ వారిని దర్శించు కొని దేవస్థానం నిత్యాన్న దాన పథకానికి విరాళం అందజేశారు. రూ.17,116 లు ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణ మోహన్ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

తాగునీటికి గ్రామస్తుల అవస్థలు

ప్రజాశక్తి - తిరువూరు : మండలం, ఎరుకోపాడు గ్రామస్తులు తాగే నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊరంతా డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ ద్వారా పంచాయతీ తాగు నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఆ నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండటంతో తాగటానికి అవకాశం లేక వాటిని వాడకానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ పరిస్థితిలో మినరల్ వాటర్ కొనలేక గ్రామంలో అధిక సంఖ్యలో దళితులు, బిసిలు ఊరికి కిలో మీటర్ దూరంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద లింగాల వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చేతిపంపు నీళ్లు తెచ్చుకుంటున్నామని వారు అవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనుల సీజన్‌లో పగలంతా పనులకెళ్లి రాత్రి ఇంటికొచ్చి అంత దూరం నడుచుకుంటూ వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చుకోవాలంటే తాము పడే ఇబ్బందులు మాటల్లో చెప్పలేవని పలువురు దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దూరప్రాంతం వెళ్లి చేతిపంపు నీళ్ల తెచ్చుకోలేని వాళ్ళు అందుబాటులో ఉన్న నీళ్ల తెచ్చుకుని తాగుతున్నారని, కానీ ఆ నీటిలో ఫ్లోరైడ్ ఉండటంతో తాగిన

చేతిపంపు నుంచి తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

వాళ్లంతా ఒళ్ళు నొప్పులతో బాధ పడు తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చినప్పుడు పార్టీ నాయకులకు తాము మంచినీటి కష్టాలు చెప్పినప్పుడల్లా మనం గెలిచిన తర్వాత ఫ్లోరైడ్ లేని మంచినీళ్ళను సరఫరా చేయిద్దామని హామీ ఇస్తూ గెలిచిన తరువాత విస్మరిస్తున్నారని గ్రామ ప్రజలు అవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏరుకోపాడు గ్రామానికి ఫ్లోరైడ్ రహిత మంచి నీరు సరఫరా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కేతనకొండ గ్రామంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ మూడో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. పిల్లలకు ఇచ్చే విలువైన ఆస్తుల్లో ఒక మంచి తండ్రిగా బాధ్యతగల తండ్రిగా ఉండటమే అని అన్నారు. తల్లిని తండ్రిని సన్మానించాలని, వారిని గౌరవించాలని బైబిల్ బోధిస్తుందన్నారు. తల్లిదండ్రుల ప్రేమను వెలకట్టలేమన్నారు. పిల్లలు నాన్న అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. నాన్న చూపిన బాట, నింపిన స్ఫూర్తి, నేర్పిన మాటలను గుర్తుంచుకోవాలన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా కొంత మంది

తండ్రులను శాలువాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అందరికీ హ్యాపీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అబ్రహం, యోబు, ప్రభుదాసు, హరీష్, అనిల్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ముఠా కార్మిక నేత సుబ్బారెడ్డి వర్ధంతి

సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీని చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : టిపిఎం మాజీ కార్పొరేటర్ సిఐటియు మోటో కార్మిక నాయకుడు టి.సుబ్బారెడ్డి ఆరో వర్ధంతి కార్యక్రమం కొత్తపేటలోని మోటూరు హనుమంతరావు భవన్లో ఆదివారం జరిగింది. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, 50వ డివిజన్ కార్పొరేటర్, పార్టీ కార్యదర్శి బోయి సత్యబాబు కార్యక్రమానికి హాజరై సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విజయవాడ నగరంలో సిపిఎం బలోపేతం కోసం తుది శ్వాస విడిచే వరకు రాజీలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్మిక నాయకునిగా నాలుగు దశాబ్దాల పాటు ముఠా కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని సైనికునిలా కృషి చేశారన్నారు. సిపిఎం కార్పొరేటర్ హోదాలో మల్లికార్జున పేటలో అంతర్గత రహదారులు, మెట్ల మార్గం నిర్మాణాలు, విద్యుద్దీపాలు, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. సిపిఎం సిద్ధాంతాల పట్ల ఆయనకున్న విశ్వాసం నేటితరం నేతలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సిఐటియు కార్యదర్శి ఈవీ నారాయణ, సిఐటియు నగర నేత ఎస్.సుబ్బారెడ్డి, ఐద్వా సహాయ కార్యదర్శి కె.వెంకటరత్నం యువజన సంఘం నేతలు ఎస్కే మస్తాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన కళాశాల సమస్యపై

ఐక్యంగా ముందుకు సాగాలి

విజయవాడ: శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటి సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక విశాలాంధ్ర భవనంలోని లైబ్రెరీ హాల్లో జరిగింది. 1980 నుండి ఇటీవల కాలం వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

కమిటి కన్వీనర్ ఉయ్యూరు సాంబి రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్య మీద ఎమ్మెల్యే ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ముందుకు సాగాలని అన్నారు. కో కన్వీనర్ డి విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంలో కళాశాలను పునః ప్రారంభించాలని, రాత్రికి రాత్రి కూల్చివేసిన వారిపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశానికి మోతుకూరి అరుణ కుమార్ అధ్యక్షత వహించగా కో కన్వీవర్ ఎన్ సాంబశివరావు న్యాయవాది బైపూడి నాగేశ్వరరావు, సైనుద్దీన్, శ్రీనివాసరావు, కిరణ్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి రాజేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి షణ్ముఖ , వైయస్ఆర్ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఏ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ వారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీవెంకటేశ్వర దేవస్థాన వార్షిక బ్రహ్మోత్స వాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 11న ప్రారంభమైన చతుర్ధశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులచే పూర్ణోత్సవం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్‌పి రమణమూర్తి, విజిలెన్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ అతిథులుగా పాల్గొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, కామాంధుల నరసింహారావు, పోతిన సాంబశివరావు, తమ్మిన సూర్యకుమారి, నగరాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రికి యాత్రికులు పోటెత్తారు. ఆదివారం, పైగా వేసవి సెలవు దినాలు ముగియడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై యాత్రికులు రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనం రద్దు చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ దుర్గా ఘాట్ రోడ్డులోని క్లాక్ రూమ్, చెప్పులు స్టాండ్, సెల్‌ఫోన్ భద్రపరిచే ప్రాంగణాలను స్వయంగా పర్యవేక్షించారు. దుర్గాఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో లిఫ్ట్ మార్గం ద్వారా దుర్గమ్మ సన్నిధికి చేరుకుని యాత్రికులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

అన్నదాత సుఖీభవకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - గంపలగూడెం : ప్రభుత్వం నుండి సంక్రమించనున్న అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావాలంటే ఈ కేవైసీ తప్పనిసరి అని గంపలగూడెం గ్రామ వ్యవసాయ అధికారి గంటా ప్రతాప్ తెలిపారు. మరో 10 రోజుల్లో జమ కానున్న ఈ సొమ్ము కోసమై ప్రతి రైతు ఈకేవైసి మరో నాలు గు రోజుల లోపల పూర్తి చేయించుకోవాలని ప్రతాప్ కోరారు.

కృష్ణమ్మకు పంచ హారతులు

విజయవాడ : పడమటి కనుమలలో పుట్టి ఎన్నో ప్రాంతాలను పునీతం చేస్తూ వివిధ పుణ్యక్షేత్రాలను తన తీరంలో కలిగివున్న పవిత్ర కృష్ణవేణీ నదీమ తల్లికి శ్రీ కనక దుర్గఅమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి రోజు సాయంత్రం శ్రీ దుర్గా స్నానఘాట్‌లో పంచహారతులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కృష్ణమ్మకు పంచహారతులు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ పాల్గొన్నారు. రేవులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి అర్చకులు వేద మంత్రాల మధ్య ఈ హారతులు సమర్పించారు.

యోగాంధ్రలో లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో పేర్ల నమోదు ప్రక్రియ నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. జిల్లాలో 7,19,464 మందిని యోగాంధ్ర కార్యక్రమంలో చేర్చాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 7,24,047 మందిని చేర్చారని, నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బందికి అభినందిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 19వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని, ఈనెల 21 వ తేదీన జరగనున్న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలందరినీ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16 వ తేదీ సోమవారం నుండి 18 వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో మూడో దశ యోగా శిక్షణ తరగతులు యోగా ట్రైనర్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో సచివాలయానికి 9 మంది యోగ ట్రైనర్లు అందుబాటులో ఉంటారన్నారు. పేర్లు నమోదు చేసుకున్న పౌరులందరూ తప్పనిసరిగా ఈ యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొని శిక్షణ పొందాలని కలెక్టర్ కోరారు.

కొండలమ్మ దేవస్థానంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 25 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ, తాగునీరు యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే దేవస్థానం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి.వి సత్యనారాయణ, వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కోటేశ్వరరావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పర్వతనేని కోటేశ్వరరావు (నవత) సేవలు ఎనలేనివని, రవాణా రంగ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పెనమలూరులోని మురళీ రీస్టార్ట్‌లో నవత కోటేశ్వరరావు సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు పి.మధు, సిపి ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ . బాబూరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వై.వి.ఈశ్వరరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎం.రాజయ్యా, ఎంఎల్‌ఏ గద్దె రామ మోహన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ, మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్ తదితరులు నవత కోటేశ్వరరావు చిత్ర పటానికి పూల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రవాణా రంగంలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నారని,

నవత సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. నవత సంస్థను దేశంలోనే అగ్రభాగాన నిలిపి వేలాదిమందికి ఉపాధి అవకా శాలు కల్పించారని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల ఎదుగుదలకు విద్యా, వైద్య, విజ్ఞాన రంగాల్లో విశేషమైన సేవలందించారని అన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, మాజీ పార్లమెంట్ సభ్యులు గంగరాజు మాట్లాడుతూ విజయవాడ ఆటోనగర్‌లో నవత ట్రాన్స్ పోర్టును స్థాపించి అంచల ంచెలుగా విస్తరింపజేశారని తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణ, అంకురిత దీక్షతో పనిచేసి దేశ వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు సేవలు సంస్థ విస్తరింపచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ సభలో, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ప్రముకులు పాల్గొనగా సభా కార్యక్రమానికి నగర ప్రముఖులు గోళ్ళ నారాయణరావు అధ్యక్షత వహించారు.

వాసుకు శుభాకాంక్షలు

విజయవాడ : విజయవాడ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన టిడిపి గొల్లపూడి గ్రామ అధ్యక్షులు నర్రావాసుకి ఎంపి కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన పాలా మాధవతో పాటు, కమిటీ డైరెక్టర్లకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

కృష్ణానదిలో ఇసుక అక్రమ తరలింపు

ఎడ్ల లంక సమీపంలో కృష్ణానది నుండి జెసిబి సహాయంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలం పాత ఎడ్లలంక సమీపంలోని కృష్ణా నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుకత్వాల వద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని బేకేతార్ చేస్తూ స్థానిక టిడిపి నాయకుల అండదండలతో పాఠశాల మెరక పేరు చెప్పి ఇసుక తరలించి బయట వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. ఎడ్ల లంక గ్రామం తరచూ వచ్చే వరదల వల్ల కోతకు గురవుతున్నప్పటికీ పట్టించుకోకుండా ఆ గ్రామ సమీపంలో ఇసుక తొవ్వి తరలించడం పట్ల గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బస్సుకా కూడా ఇతరులకు అక్రమంగా అమ్ముకుంటున్నార.ు ఇదంతా తెలిసినప్పటికీ మండల రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. అక్టోబర్ 15 వరకు నదిలో ఎటువంటి ఇసుక అక్రమ తవ్వకాలు జరపవద్దని ఇసుక తరలింపును అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలను రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం.ఎడ్ల లంక వంటి గ్రామం వరదల వల్ల కోతకు గురవుతూ కొన్ని నివాసాలు నదిలో కలిసిపోతున్నాయి. అయినప్పటికీ నదిలో ఇసుక తవ్వకాలు జరపటం అది తెలియనట్టు రెవెన్యూ అధికారులు చోద్యం చూడ్డం గ్రామానికి తీవ్ర నష్టమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యకు ప్రాధాన్యం

- రవితేజ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరక్టర్ వల్లభనేని వరప్రసాద్

ప్రజాశక్తి-కోడూరు : క్రమశిక్షణతో కూడిన విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు కోడూరులోని రవితేజ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరక్టర్ వల్లభ నేని వరప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయ ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్ ను ఉన్నతంగా తీర్చిదిద్దటం మాలక్ష్యం అని అన్నారు. కోడూరులో మొట్టమొదటి సారి ప్లే స్కూల్ ప్రారంభించి విద్యతో పాటు క్రమశిక్షణ మరియు విలువలకు ప్రాధాన్యత ఇవ్వటమే కాకుండా విశాలమైన ఆటస్థలం, నిరంతరం సీసీటీవీల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ టీచింగు కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అనుభవంగాల ఉపాధ్యాయులచే విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. గత విద్యా సంవత్సరం లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన కొరివి శతి సాత్విక్ కష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రతిభ అవార్డులతో సత్కరించి

20000 రూపాయలు క్యాష్ అవార్డు మెడల్ మరియు ప్రశంసా పత్రంతో ప్రభుత్వం తరఫున సత్కరిం చారని అన్నారు. గత సంవత్సరంలో గోదావరి ఒలంపియాడ్‌లో 20 నుంది విద్యార్థులు జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి క్యాష్ అవార్డులతో పాటు మెమెంటోలు, ఎలక్ట్రానిక్ టాబ్లు గెలుచుకున్నారన్నారు. ఈ సంవత్సరం నుండి రవితేజ పాఠశాలలో 10వ తరగతిలో మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 25 వేల రూపాయలు, జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 50 వేల రూపాయలు, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలచిన విద్యార్థికి అక్షరాల లక్ష రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు పాఠశాల డైరెక్టర్‌లలో ఒకరైన ముమ్మనేని రవిచంద్ తెలిపారు. విద్యలోనే కాకుండా క్రీడల పట్ల ఆసక్తి కలిగిన

విద్యార్థులను గుర్తించి ఆటలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు భారతీయ విలువలు సాంప్రదాయాలు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించడం మా పాఠశాల ప్రత్యేకత అని అన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్‌మీటర్లు ఆపకపోతే పోరాటం ఉధృతం : సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ : స్మార్ట్ మీటర్లు బిగించడం తక్షణమే నిలుపుదల చేయాలని, బిగించిన మీటర్లు వెంటనే తీసేయాలి లేకపోతే ఈ పోరాటం ఉధతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం గుడివాడ నైజాంపేటలో స్మార్ట్ మీటర్లు వల్ల వచ్చే నష్టాలను వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది స్మార్ట్ మీటర్లు గురించి మాకు ఏమీ తెలియదు, ఎవరో వచ్చి ఇళ్లల్లో లేనప్పుడు స్మార్ట్ మీటర్లు బలవంతంగా పెట్టేసి వెళ్ళిపోతున్నారని చెబుతున్నారన్నారు. కొంతమంది అయితే స్మార్ట్ మీటర్ పెట్టి ప్రజల దగ్గర డబ్బులు కూడా వసూలు చేశారని చెబుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే నష్టాన్ని వివరించకుండా ఇలా బలవంతమైన స్మార్ట్ మీటర్లు బిగించడం వలన ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. కాబట్టి ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతంలో అధికారంలోకి రాకముందు ఏం చెప్పిందో దానికి వ్యతిరేకంగా నేడు స్మార్ట్ మీటర్‌లను పెడుతోందన్నారు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి. మండల కమిటీ సభ్యులు పి రజిని, రేపాని కొండ, చల్లా ప్రసాదు, బొంతు వెంకటేశ్వరావు, సమరం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన కేంద్ర వాణిజ్యం పరిశ్రమల శాఖమంత్రి పీయుష్ గోయల్ కు ఆదివారం గన్నవరం విమానా శ్రయంలో సాదర స్వాగతం లభించింది. గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి జి. బాలసుబ్రమణ్యం పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, ఉండవల్లిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యేందుకు వారి నివాసానికి బయలుదేరి వెళ్లారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆదాయం రూ.10,64,518

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం ఒక్కరోజే సుమారు పదివేల 645 మంది భక్తులు దర్శించు కున్నట్లు ఆలయ సంయుక్త కమిషనర్ కార్యని ర్వాహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు దేవస్థానానికి పది లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. శాశ్వత అన్నదానం కార్యక్రమం నిమిత్తం 20,002 రూపాయలు,.నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం 1,15,765 రూపాయలు, స్వామి వారి కళ్యాణ కట్ట టిక్కెట్ల ద్వారా 25,120 రూపాయలు, ప్రసాదం విక్రయం ద్వారా 1,76,565 రూపాయలు, స్వామి దర్శనం టికెట్ల ద్వారా వచ్చిన రుసుము 78,650 రూపాయలు, స్వామి వారికి వివిధ సేవా టిక్కెట్ల ద్వారా వచ్చిన రుసుము 6,48,116 రూపాయలతో మొత్తం రుసుము - 10,64,518 రూపాయలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఆది మంగళవారాల్లో భక్తులు రద్దీని దష్టిలో పెట్టుకొని భక్తులకు సంతప్తికర దర్శన లభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రహదారి మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - వీరులపాడు : మండలం పెద్దాపురం గ్రామంలో ఆర్‌అండ్‌బి రహదారి పూర్తిగా గోతులమయంగా మారడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది. పెద్దాపురం టు ఎర్రిపాలెం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారి కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రహదారి మొత్తం గోతులమయంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం వందల వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఆ గుంతల్లో పడి క్షతగాత్రులైన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు

సమావేశమైన సిఐటియు నాయకులు

9న సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - విసన్నపేట : విస్సన్నపేట సిఐటియు మండల కమిటీ సమావేశం స్థానిక విస్సన్నపేట బస్టాండ్ దగ్గర తాపీ వర్కర్ యూనియన్ కార్యాల యంలో ఆదివారం సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కమిటీని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి మద్దతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ బాషా.తాపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు మర్రిబోయిన అప్పారావు సెక్రటరీ శ్రీనివాసరావు మురళి కష్ణ ఆశ వర్కర్ యూనియన్ అధ్యక్షులు చిలకమ్మ సిఐటియు మాజీ మండల కార్యదర్శి నక్క తిరుపతమ్మ మహిళా సంఘం మండల కార్యదర్శి ధనలక్ష్మి వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

బ్యాటరీ ట్రై సైకిళ్ల అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో ఆదివారం జగ్గయ్యపేట నియోజకవర్గం వికలాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వికలాంగులకు బ్యాటరీ ట్రై ఎంఎల్‌ఎ శ్రీరాం తాతయ్య అందజేశారు. ఈ సైకిళ్లను తీసుకొచ్చేందుకు కృషి చేసిన వడ్డెపూడి ఉమామహేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక (జెవివి) తిరువూరు శాఖ ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలలో ప్రతి రెండు నెలలకొకసారి మూడో ఆదివారం నిర్వహిస్తున్న బిపి, షుగర్, ఫిట్స్ రోగుల వైద్య శిబిరానికి 950 మంది హాజరయ్యారు. తిరువూరు పరిసర జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, ఖమ్మం జిల్లాలనుండి వచ్చిన రోగులకు వైద్యులు రెండు నెలలకు సరిపడ మందులు అందచేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బిపి, షుగర్ కేవలం మందుల వాడకంతోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని, రోజులో రెండుసార్లు మాత్రమే ఆహారం తీసుకోవాలని, ఒక్కపూట తప్పనిసరిగా తృణ ధాన్యాలు తినాలని చెప్పారు. వీటితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. వైద్యులు సత్యతేజ, వి.రవీంద్ర, లక్ష్మణరావు, శివాజీ, మదర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ విద్యార్థులు, జనవిజ్ఞానవేదిక సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

17న ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలం చట్టన్నవరం గ్రామంలో మంగళవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వివరాలు తెలిపారు. పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేసి, శుక్లాలు, పొరలు ఉన్న వారిని అదేరోజు హాస్పిటల్‌కు తీసుకొని వెళ్తారన్నారు. ఉచితంగా ఆపరేషన్ చేస్తారు అని సర్పంచ్ దుర్గారావు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం చట్టన్నవరం గ్రామంలోని ఉన్న సిఎస్ఐ ఎలిమెంటరీ స్కూల్ ఏరియాలో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

విజయవాడలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు, జగ్గయ్యపేటలో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాల్లో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గొనకూడదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

జగ్గయ్యపేట : పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోనే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సన్మార్గంలో ఉంటూ పోలీసులకు, సమాజానికి సహకరించాలని వారిని కోరారు. పద్ధతి మార్చుకోకుండా నేర ప్రవర్తన కొనసాగించే వారిని ఉపేక్షించమని, వారిపై పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠిన చర్యల తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్ హాజరు కావాలని, రానివారు వారు హేతుబద్ధమైన కారణాలు తెలియ జేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎస్సై జి రాజు, చిలకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. విజయవాడ రూరల్ మండలంలోని ముగ్గురు లబ్ధిదారులకు రూ.89 వేలు, ఇబ్రహీంపట్నం మండలంలోని 10 మందికి రూ.8.79 లక్షలు సిఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. గొల్లపూడిలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఈ చెక్కులను అందజేశారు.

పల్లాకు పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎం.ఎల్.ఎ. పల్లా శ్రీనివాసరావును ఆయన నివాసంలో రాష్ట్ర నగరాల సంఘం ప్రతినిధులు పరామర్శించారు. పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎంఎల్ఎ పల్లా సింహాచలం ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నగరాల సంఘు ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావును పరామర్శించి నగరాల సంఘం తరపున ప్రగాఢ సంతాపం తెలిపారు. పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి బిసి సాధికార సమితి (నగరాలు) రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు తమ్మిన విజయ్, సాధికార కమిటీ సభ్యులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ల ప్రమాణస్వీకార మహోత్సవ ర్యాలీ కొండపల్లిలో అట్టహాసంగా జరిగింది. ముందుగా కొండపల్లిలోని ఎన్టీఆర్, రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా ర్యాలీకి తరలి వచ్చారు. ద్విచక్ర వాహనాలతో, కార్లలో ప్రమాణం స్వీకారానికి గొల్లపూడి సభా వేదికకు తరలివెళ్లారు.

ఆనందరెడ్డికి జాతీయ పర్యావరణ అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఇన్చార్జ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి జాతీయ పర్యావరణ అవార్డు అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు టౌన్ హాల్లో జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ పర్యావరణ అవార్డుల మహోత్సవ సభలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ జాతీయ పర్యావరణ అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో పర్యావరణం పరిరక్షణకు మరిన్ని కార్యక్రమాలు చేపడతమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పర్యావరణ సంస్థ చైర్మన్ విజయరాజు ధమాల్, కర్ణాటక జాతీయ పర్యావరణ సంస్థ అధ్యక్షులు ఎ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న బ్రహ్మానంద రెడ్డి

ముగిసిన రోటరీ కృత్రిమ కాళ్ల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హీల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 9 నుండి జరుగుతున్న రోటరీ కృత్రిమ కాళ్ళ పంపిణీ ఆదివారంతో ముగిసింది. 35 మంది వికలాంగులకు 'ప్రభా ఫుట్' కృత్రిమ కాళ్ళను అమర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రోటరీ గవర్నరు శరత్ చౌదరి మాట్లాడారు. ఈ శిబిరంలో మొత్తం 128 మంది వికలాంగులకు, ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్లను అమర్చడమే కాకుండా వారికి ఈ కాళ్ళను ఉపయోగించి నవడం, మెట్లు ఎక్కడం, కాలు ముడుచుకొని కూర్చోవడం వంటివి నేర్పించి తర్ఫీదు ఇచ్చినట్లు, గుజరాత్ లోని భావ్ నగర్ నుండి వచ్చిన ప్రోస్తెటిస్ట్ & ర్థోటిస్ట్ డాక్టర్ రవి వాటలియ చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబిలీ హీల్స్ అధ్యక్షులు వి.సి.రెడ్డి, బాలకోటి రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ డైరెక్టర్ త్రిపురనేని మురలి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందె మురళి మోహన రావు, ప్రొజెక్టు ఛైర్మన్ అనిల్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు పారేపల్లి నిరంజన్ గుప్త, వడ్లమూడి శ్రీనివాసరావు, చనుమోలు గోపాల్, ప్రగడ రాజశేఖర్, అందే రేవంత్ కుమార్, మాయకుంట క్రాంతి కుమార్, మునగపాటి నాగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' పై హర్షం

ప్రజాశక్తి - గుడివాడ : జనసేన నాయకుడు సందు పవన్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా కుటమి నాయకుల ఫొటోలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. స్థానిక బొగ్గ బజారులోని జనసేన కార్యాలయంలో సందు పవన్ ఆధ్వర్యంలో తల్లికి వందనం పథకం డబ్బు రూ.13 వేల చొప్పున ఇంట్లో ఎంత మంది చదువుకునే విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లుల అకౌంట్లలో జమ అవుతుండడం మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గుళ్లపల్లి రమాదేవి, వెణుతురుమిల్లి గ్రామ సర్పంచ్ కొప్పినేని శేషవేణి, నాయకులు సీతాల సుభాషిణి, వంగలపూడి రాము, మోగసాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటికో మొక్క' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మణ స్వామి (చిన్నావురం డాక్టర్) వితరణతో ఇంటికో మొక్క ప్రతి పౌరుని బాధ్యత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బందరు బందావనం టీమ్ పిలుపునిచ్చారు. జూలై 13 ఆదివారం హిందూ కాలేజీ ఎదురుగా స్థలంలో 50 వేల మొక్కల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బందరు మొత్తాన్ని బందావనం చేసే బృహత్తర కార్యక్రమంలో అందరూ పాలుపంచుకుందామని జొన్నలగడ్డ కాంత్ ఆదివారం అన్నారు. బందరు ప్రజలకు ఏ మొక్క అవసరమో తెలుసుకుని ఆ మొక్కను ఇచ్చే కార్యక్రమంలో అందరూ భాగ స్వాములు కావాలని సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ భాషా పిలుపునిచ్చారు. ఈ నెల జూన్ 14,15,16 తారీఖుల్లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనక ఉన్న సహాయ సేవా క్యాంటీన్‌లో, 17,18 తారీఖుల్లో లక్ష్మీ టాకీస్ సెంటర్ లో డీమార్ట్ రోడ్ లో సాయి కష్ణ హెూటల్ పక్కన స్థలంలో ఎవరికి ఏ మొక్క కావాలో వాటికి సంబంధించిన స్లిప్‌లను అందిస్తామన్నారు.

వైభవంగా అంకమ్మ నెల సంబరం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వలో తాతినేని వంశీయుల ఇలవేల్పు శ్రీ అంకమ్మ నెల సంబరం ఆదివారం డప్పు వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సంబరానికి ఆ వంశానికి చెందిన కుటుంబాలు సామూహికంగా గ్రామంలో పోతురాజు గడతో అమ్మవారి ఘటంతో ఊరేగింపు నిర్వహించి దేవాలయం వద్ద మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భద్రపరిచిన పెట్టెతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం అమ్మవారిని దేవాలయంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఏపిఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తి అయ్యిందని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతిస్తు న్నామని ఉద్యోగులు ఎదురుచూస్తున్న డిమాండ్ల పరిష్కారం వైపు ప్రభుత్వం దష్టి సారించాలని ఏపి ఎన్‌జిజిఒ సంఘ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న విద్యాసాగర్ అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో ఖాళీ ఏర్పడిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ఆదివారం సంఘ రాష్ట్ర కార్యాలయంలో కో ఆప్షన్ విధానంలో జరిగిన ఎన్నికల్లో విజయనగరం జిల్లాకు చెందిన డి.వి. రమణ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ఆ పరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందనే భావన ప్రభుత్వ ఉద్యోగులలో నెలకొందన్నారు. ఉద్యోగ వర్గాలు ప్రభుత్వంపై చాలా అసంతప్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. 2023 జూలై నెలలో నియమించాల్సిన పే ఆర్ సి కమిటీని ఇప్పటివరకు నియమించ పోవడంతో ఉద్యోగులు తమకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు నష్టపోతున్నారని, పిఆర్సి అంశంలో తక్షణ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల విషయంలో వారు నివాసం ఉంటున్న లోకల్ మండ లంలో పనిచేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం సోచనీయమని, ఏ గ్రామానికైనా బదిలీ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచిం చాలన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి డి.వి. రమణ మాట్లాడుతూ ఎంతోమంది ఉద్దండులు అలంకరించిన ఈ పదవికి తాను ఎన్నిక కావడం అదష్టం కాదని, నా పట్ల రాష్ట్రంలోని ఉద్యోగులకున్న నమ్మకమే నన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్ర అధ్యక్షుని మార్గదర్శకత్వంలో ప్రతి ఉద్యోగికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నూతన కార్యదర్శికి, అధ్యక్షునికి వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, రాష్ట్రంలో 13 జిల్లాల చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గంలోని వివిధ జిల్లాలకు చెందిన ఉపాధ్యక్షులు, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఉద్యోగులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - గుడివాడ : జులై 9వ తేదీన జరగనున్న సమ్మెకు కార్మిక సోదరులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాదాల వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ కనీస వేతనాలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు డి ఆదిలక్ష్మి, పట్టణ కార్యదర్శి సిహెచ్ శివ నాగమల్లేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ కొండ, ఆర్‌పి యూనియన్ నాయకురాలు దీవెన, శైలజ ,నిర్మల, అంగన్వాడి వర్కర్ ఆదిలక్ష్మి, ఆటోనగర్ యూనియన్ నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సిపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు

102 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-కంకిపాడు : పర్ణశాల ప్రార్థనా మందిరం (ఘంటసాల)వారి ఆధ్వర్యంలో తాడిగడప గ్రామంలోని కర్మేలు ప్రార్థనామందిరం ఆవరణలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మచిలీపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ శశాంక్ బీపీ, షుగర్, జలుబు, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపారు. సుమారు 102 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రూ.25 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. పాస్టర్లు పి.ఎన్.రాజు, ఎం.ఎస్.ఆర్.కే, వెంకటరత్నం, కిరణ్, సుకన్య, బిందు, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలడుగు శివకు 'గద్దర్' అవార్డు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండలం ముదునూరుకు చెందిన పాలడుగు శివ ఉత్తమ కథారచయితగా తెలంగాణ ప్రభుత్వం నుంచి గద్దర్ అవార్డు అందుకున్నారు. మ్యూజిక్ షాప్ మూర్తి సినిమా కు కథారచయితగా శివకు తొలిచిత్రం కావడం విశేషం. హైదరాబాద్లో శనివారం జరి గిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024 ప్రధానోత్సవం లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజా నుంచి శివ అవార్డు అందుకున్నారు. ముదునూరు పీఏసీఎస్ ది మాజీ అధ్యక్షుడు పాలడుగు సత్యనా రాయణ కుమారుడు పాలడుశివ విదేశాల్లో చదువుకుని, వ్యాపారం చేసి తిరిగివచ్చి తెలుగు సినిమాపై ఉన్న అభిమానం, ప్రేమ తో సినీరంగంలో అడుగుపెట్టాడు. కథారచయిత, నిర్మాతగా నిలిచి తొలిచిత్రానికి ఉత్త కథరచ యితగా గద్దర్ అవార్డు అందుకోవడం పట్ల పలువురు గ్రామస్తులు, అభిమానులు ఆదివారం గ్రామంలో సంబరాలు చేసుకుని అభినందనలు తెలిపారు.

పిహెచ్‌డి సాధించడం అభినందనీయం

ప్రజాశక్తి-ఉంగుటూరు : రామకృష్ణారెడ్డి పీహెచ్డీ సాధించడం తమ కళాశాలకు గర్వకారణం అని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివికెఎస్‌వి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ కళాశాలకు సంబంధించిన ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకష్ణారెడ్డి ఈమని వెల్ టెక్ విశ్వవిద్యాలయం నుండి "తక్కువ శక్తి వినియోగ యాడర్ సర్క్యూట్ లు, ఆధునిక అనువర్తనాల పరిశోధన అంచనా ఆధారిత, సంపూర్ణ యాడార్ రూపకల్పన, అమలు" అనే అంశంపై పిహెచ్చిని విజయవంతంగా పూర్తి చేయడం గర్వకారణమని అన్నారు. కళాశాల ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం, కళాశాల డీన్ సిహెచ్ శాంతిరాణి, ఈసీఈ విభాగా ధిపతి బి నాంచారయ్య, అధ్యాపక బందం పాల్గొని రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు.

లోకేష్‌పై ఆరోపణలు సిగ్గుచేటు : వేదవ్యాస్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తున్న అంశంలో వైసిపి నాయకులు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అసత్యఆరోపణలు చేయడంపట్ల టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంచనాల కమిటీ మాజీ చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా తల్లులకు అందుతున్న సొమ్ము నుంచి రెండు వేల రూపాయలను ప్రభుత్వం మినహాయించి పాఠశాలల నిర్వహణ కోసం ఖర్చు చేయాలని చూస్తుండగా వైసీపీ నాయకులు ఆ ఆ సొమ్ము లోకేష్ ఖాతాలోకి మళ్లిస్తున్నారని ఆరోపించటం సిగ్గుచేటు అన్నారు. గతంలో వైసిపి హయాంలో కూడా ఆ ప్రభుత్వం ఇదే విధానాన్ని అమలు చేసిన విషయాన్ని వ్యాస్ గుర్తు చేశారు. ఇలా మినహాయించిన సొమ్ము కలెక్టర్ ఖాతాలోకి వెళుతున్న విషయాన్ని వ్యాస్ వివరించారు. ఆ నిధులతో ఆయా పాఠశాలల్లో కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

104 సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : గ్రామగ్రామానికి వెళ్లి ఆరోగ్య సేవలందించే 104 సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని 104 మొబైల్ మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీరనాల రేఖా ఫణి కుమార్ అన్నారు. మచిలీపట్నంలోని బుట్టాయిపేట టౌన్ హాల్ వెనుక మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. 104 మొబైల్ మెడికల్ యూనిట్ జిల్లా అధ్యక్షులు అర్జా మురళీకృష్ణ అధ్యక్షతవహించిన ఈకార్యక్రమంలో వీరనాల రేఖా ఫణి కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల కు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం 104 సర్వీస్ లు నిర్వహిస్తున్న యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించా లన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి మరమ్మ తులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. యూనియన్ గౌరవా ధ్యక్షులు బూర సుబ్రమణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి : టిడిపి

ప్రజాశక్తి-కోడూరు : విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని కోడూరు మండల టీడీపీ అధ్యక్షులు బండె శ్రీనివాసరావు అన్నారు. విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తూ చిన్నారుల చదువు కోసం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన సందర్భంగా శనివారం, ఆదివారం కోడూరు మండల పరిధిలోని హరిపురం, జరుగువాని పాలెం, నక్కవానిదారి గ్రామాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు చిన్నారులు, తల్లిదండ్రుల క్షీరా భిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచా రు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు చిన్నారులు, నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ ఫలితాల్లో మెరిసిన స్నేహలత

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపలగూడెం గ్రామానికి చెందిన పెదగమళ్ల స్నేహలత ఈ ఏడాది విడుదలైన నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 44కె ర్యాంకుతో మెరిసింది. గడిచిన ఏడాది నీట్ ఫలితాల్లో సరైన ప్రతిభ కనబరచలేకపోయినప్పటికీ, స్నేహలత తన మనోధైర్యంతో ఎలాగైనా డాక్టర్ కావాలన్న పట్టుదల, కృషి ఫలించింది. ఎట్టకేలకు 2025-26 మెడికల్ విద్యా సంవత్సరంలో ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత ఎం.బి.బి.ఎస్ సీటు దక్కించుకోనుంది. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ, తన తండ్రి ఆర్ఎంపి వైద్యునిగా, తల్లి టైలరింగ్ వృత్తి నిర్వహిస్తూ, తన పట్ల అపారమైన ప్రేమను పంచారు. నేను ఈ సీటు సాధించడం పట్ల నా తల్లిదండ్రుల కృషి మిన్నగా, పేర్కొంది.

నీట్‌లో శ్రీ నిత్య ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన పోతురాజు శ్రీనిత్య నెట్ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియాలో 47,773 ర్యాంక్, ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరిలో 5800 ర్యాంకు, 504/720 మార్కులు సాధించారు. తండ్రి వసంతరావు పోస్టల్ ఉద్యోగి, ఇంటర్ జగ్గయ్యపేట జెఆర్‌సిలో చదవగా, శ్రీవశిష్ట విజయవాడలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంది. స్టేట్ ర్యాంక్ 1200 లోపు వచ్చే అవకాశం వుంది.

చీమలపాడులో శ్రీ శ్రీ వర్ధంతి

ఆకట్టుకున్న నృత్యాలు, కోలాటం

ప్రజాశక్తి - ఎ.కొండూరు : మహాకవి శ్రీ శ్రీ 42వ వర్ధంతి ప్రజానాట్యమండలి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చీమలపాడులో నిర్వహించారు. తొలుత శ్రీ శ్రీ చిత్ర పటానికి జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ శ్రీ స్ఫూర్తితో జనజాగృతికే కళారూపాల్ని ప్రదర్శించాలని ఉద్ఘాటించారు. కార్యక్రమానికి జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చీమలపాడు, రామచంద్రాపురం బాలలు ప్రదర్శించిన కోలాటం, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పంతంగి తులసీరాణి, ఎం.నాగమణి, ఆలీబాబా, పంబి, యోహాన్ ఆలపించిన అభ్యుదయ పాటలు అలరించాయి. ఐద్వా మండల నాయకులు ఆళ్ల ఉమాదేవి, విజయలక్ష్మి సహకరించారు. పాణ్యం ఆనందరావు దంపతులు కళాకారులకు అతిథ్యమిచ్చారు.

నీట్‌లో ఆకాశ్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల శిక్షణ సంస్థ ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్)కు చెందిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు నీట్ యూజీ-2025లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కె.నిఖిల్ సాయి జాతీయ స్థాయిలో 297వ ర్యాంకు, ఎం.కునాల్ 479వ ర్యాంకు, రిత్విక్ జోషి 557వ ర్యాంకు, తేజేశ్వర్ కృష్ణమూర్తి 620వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. వీరితో పాటు మరికొందరు కూడా ఉత్తమ ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆకాశ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ వీఎస్ నరేష్, క్లస్టర్ హెడ్ మహేంద్ర, గుంటూరు బ్రాంచ్ హెడ్ జి.సురేష్ దాస్, అకడమిక్ హెడ్ జెఎన్ఎస్ ఆర్‌సి మూర్తి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు ఆకాశ్ అనుసరించిన వినూత్న బోధన విధానాల వల్లే తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారని వారు పేర్కొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ కొరియా కప్‌కు కార్తీక్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడకు చెందిన బి.ఎమ్.ఎన్.వి.కార్తీక్ భారత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. కొరియాలోని ఇంచెయోన్‌లో ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న బ్యాంక్ ఇంచెయోన్ కొరియా కప్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు కార్తీక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా కార్తీక్‌కు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, అధ్యక్షులు వి.శ్రీనుబాబు, కోశాధికారి బిల్లా నీరజ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆలిండియా మెడికల్ ఎంట్రన్స్ నీట్ పరీక్ష ఫలితాల్లో జగ్గయ్యపేట విద్యార్థి వడ్డేపల్లి యజ్ఞేశ్వర్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 2168, ఒబిసి కేటగిరిలో 741ర్యాంక్ సాధించాడు. 590/ 720 మార్కులతో 99.89 పర్సంటైల్ తో ఈ ఘనత సాధించాడు. యజ్ఞేశ్వర్ 1 నుండి 10వ తరగతి వరకు జగ్గయ్యపేట చేగు విద్యాలయంలో, ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య బాలుర కళాశాల (గోశాల)లో చదివాడు. తండ్రి డా.వడ్డేపల్లి శ్రీనివాసరావు సంస్కృతాంధ్ర పండితుడు స్థానిక శ్రీలక్ష్మ కలాశాలలో సంస్కృతాంధ్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. తాత్వికులు గెంటేల వెంకటరమణ దంపతులు, ఎంఎల్ఏ తాతయ్య యజ్ఞేశ్వర్‌ను అభినందించారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో శ్రీరమణ గురువుల ఆశీస్సులతో తాను ఈ ర్యాంక్ సాధించానని, భవిష్యత్‌లో న్యూరో సర్జన్‌గా ప్రజలకు సేవలందిస్తానని యజ్ఞేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ సంవత్సరం మే 4న నిర్వహించిన నీట్ పరీక్షలో సుమారు 21 లక్షల మంది హాజరు కాగా, తమ కుమారుడు ఈ ర్యాంక్ సాధించడంపట్ల తల్లిదండ్రులు భువనేశ్వరి, శ్రీనివాసరావు దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

రహదారిపైనే మురుగునీరు

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని బొర్రగూడెం ప్రధాన రహదారిపై మురుగునీరు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారి గుండా గ్రామస్తులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. సమీపంలోని తిరుపతమ్మ ఆలయానికి నిత్యం యాత్రికులు వచ్చి వెళ్తుంటారు. రహదారిపై నీరు నిల్వ ఉండటంతో వారు అసౌకర్యానికి గురవున్నారు. ప్రధాన రహదారికి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో గృహాల్లో వాడుక నీరు, వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. రాత్రి వేళలో దోమలు వ్యాప్తి చెందటంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామానికి చెందిన జాజుల రాణి వాపోయింది. అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై నీరు నిలవలేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అందరికీ అందని తల్లికి వందనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తల్లికి వందనం మిగిల్చిన కోతలతో తల్లులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం జాబితాలో తమ బిడ్డల పేర్లు లేకపోవడంతో పథకానికి అనర్హులంటు ఏ విధంగా ప్రకటించారో అర్ధంకాక అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి ఎన్నికల హామీలే ముఖ్య కారణం. కూటమి నేతలు ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రచారాస్త్రంగా మలచుకొని ప్రజల ముందుకెళ్లారు. సూపర్ సిక్స్ పథకాలలో తల్లులను ప్రధానంగా ఆకర్షించిన హామీ తల్లికి వందనం.

గత ప్రభుత్వం విధించిన నిబంధనల కన్నా కఠిన నిబంధనలు అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించింది. వీటిలో తెల్లరేషన్ కార్డు లేదని, రూ.12 వేలకు మించి ఆదాయం పొందుతున్నారని స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, ఇంట్లో ఒకరు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్నారని ఇలా పలు నిబంధనల పేరిట అనర్హులుగా ప్రకటించింది. దీంతో వారంతా ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తల్లులందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక సిగ్గు ఎగ్గు లేకుండా కుంటి సాకులు చూపుతూ తల్లికి వందనం పథకాన్ని తమకు ఎగ్గొట్టారంటూ మండి పడుతున్నారు. ఇద్దరు బిడ్డల్లో ఒకరికే నగదు జమ చేశారంటూ వాపోతున్న వారు కొందరు కాక, జగన్ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల మహిళలకు నాలుగేళ్లపాటు అమ్మ ఒడి పథకం కింద నగదు జమ చేశారని గుర్తు చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వని కూటమి ప్రభుత్వం రూ.12వేలు పైబడి నెలసరి వేతనం పొందుతున్నారని నెపాన్ని మోపుతూ తమను అనర్హులుగా ప్రకటించటం ఎంతవరకు సబబు అని స్కీమ్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ నిలదీస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని చిత్తశుద్ధితో అమలు జరిపి తల్లులందరి ఖాతాల్లో నగదు జమ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేలం నీలిమ, గృహిణి : ఇద్దరు కుమార్తెలు
ఇద్దరిలో ఒకరు మాత్రమే తల్లికి వందనం అందింది. ఇంకొకరికి అందలేదు.

అల్లాడి చంద్ర : డ్వాక్రా మహిళ : ఇద్దరు కుమార్తెలు :
ఇద్దరు తల్లికి వందనం పథకానికి అనర్హతగా పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.